క్లుప్తంగా

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అలంపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఎర్రవల్లి మండలం జింకలపల్లికి చెందిన తెలుగు సుంకమ్మకు చికిత్స నిమిత్తం రూ.6 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

ఉచితంగా సిమెంట్ పంపిణీ

అయిజ: మండలంలోని సింధనూరు గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అదే గ్రామానికి చెందిన దాతలు పావని, విద్యాసాగర్, బస్వరాజు ఉచితంగా సిమెంట్ బస్తాలను పంపిణీ చేశారు. ఆరుగురికి ఒక్కొక్కరికి 5 బస్తాల సిమెంట్ అందజేశారు. అదే విధంగా భవిష్యత్‌లో కూడా నిరుపేద కుటుంబాలకు సాయం చేస్తామని దాతలు పేర్కొన్నారు.

రేపు టీబీ వైద్య శిబిరం

అలంపూర్: ఈ నెల 8న వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీబీ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాశీపురం గ్రామంలో టీబీ ముక్త్ భరత్ అభియాన్‌లో భాగంగా క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని కాశీపురం, సింగవరం-1, సింగవరం-2, ఉండవెల్లి మండలంలోని భైరాపురం, బస్వాపురం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



శాంతినగర్: సామాన్యులపై భారం పడకుండా జీఎస్టీ తగ్గించినందుకు ప్రధాని మోదీ చిత్రపటానికి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజల ఉన్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

మానవపాడు: కేటిదొడ్డి మండలంలోని పాగుంటలో రజకులపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా రజక సంఘం కన్వీనర్ నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీకి పిలిపించి దాడి చేయడం దారుణమన్నారు. నిందితులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని శనివారం పేర్కొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో డబుల్‌బెడ్రూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణరావులు హాజరైయ్యారు. ఈ క్రమంలో వారి పర్యటనకు అవాంతరాలు సృష్టించనున్నారన్న ఆరోపణలతో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు హన్మంతు, పల్లయ్య, రాజు, బండల వెంకట్రాములతో పాటు మరి కొందరిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

వైభవంగా ఉత్సవాలు

చిన్నచింతకుంట: మండలం లాల్‌కోటలో కొలువుదీరిన ఆంజనేయ, ఈశ్వర, వేంకటేశ్వర స్వామివార్ల ఉత్సవాలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామస్తులు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సదర్భంగా గ్రామంలోని సింగిల్‌విండో కార్యాలయం లాకర్‌లో భద్రపరిచిన స్వాముల వారి వెండి ఆభరణాలను ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ముగ్గురు స్వాములకు అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం చంద్రగ్రహణం కారణంగా ఉత్సవాలను నిలిపి వేయనున్నారు. సోమ, మంగళవారాల్లో కొనసాగిస్తారు. ఉత్సవాలకు నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మూగ జీవాలకు మందుల్లేవ్



నందిన్నెలోని పశువుల ఉపకేంద్రం

- రెండేళ్లుగా నిలిచిన సరఫరా
- ప్రైవేటు షాపుల నుంచి కొనుగోళ్లు
- పట్టించుకోని అధికారులు

కేటీదొడ్డి: మండలంలో మూగ జీవాలకు అవసరమయ్యే మందులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పశుపోషకులు వాపోతున్నారు. రెండేళ్లుగా ప్రభుత్వం నట్టల నివారణ మందు, పలు రకాల మందులు పంపిణీ నిలిపివేయడంతో మూగ జీవాలు రోగాల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నామని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు సబ్ సెంటర్లు

నూతనంగా ఏర్పడిన మండలంలో పశువైద్యశాల అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు పశు పోషకులు పేర్కొంటున్నారు. చింతలగుంట, నందిన్నె గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉప కేంద్రాల్లో కూడా మందులు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు రోగాల బారిన పడినప్పుడు చేసేదేమీ లేక ప్రైవేటు దుకాణాలన ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.



చింతలకుంట సబ్ సెంటర్ వద్ద పశువులను చికిత్సకు తీసుకొచ్చిన గ్రామస్తులు

86,408 పశువులు

మండలంలో పశువైద్యాధికారుల నివేదిక మేరకు బర్రెలు 2663, గొర్రెలు 69,621, ఆవులు, ఎద్దులు 9,523, మేకలు 4069, పందులు 173, కుక్కలు 359 ఉన్నట్లు పేర్కొన్నారు.

సంక్రమించే వ్యాధులు

వర్షాకాలం ప్రారంభంలో పశువులు సహజంగానే వ్యాధుల బారిన పడుతుంటాయి. గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు, గురక, మశూచి తదితర వ్యాధుల బారిన పడుతుంటాయి. వీటితో పాటు జ్వరం, అరుగుదల లేకపోవడం, నోటిలో పుండ్లు ఏర్పడుతుంటాయని పేర్కొంటున్నారు.

నిలిచిన మందుల సరఫరా

ప్రభుత్వం పశువుల ఆస్పత్రుల్లో వివిధ రకాల టీకాలతో పాటు నట్టల నివారణ మందు విటమిన్ మాత్రలు గతంలో ఏడాదిలో మూడుసార్లు పంపిణీ చేసేవారు. దీంతో జీవాల శరీరంలో నట్టల నివారణ జరిగి ఆరోగ్యంగా బలంగా ఉండేవి. దీంతో పెంపక దారులకు గిట్టుబాటు లభించి లాభాలు పొందేవారు. రెండేళ్లుగా ప్రభుత్వం మందుల పంపిణీ నిలిపి వేయడంతో మూగజీవాల యజమానులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కసారి మూగజీవాలకు మందు పట్టించేందుకు రూ. 2 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

జాడలేని అవగాహన సదస్సులు

పశువులకు సంక్రమించే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గతంలో పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించే వారు. క్రమ క్రమంగా సదస్సుల జాడ కనుమరుగవుతోంది. వ్యాక్సిన్లు వేసే సమయంలో అధికారులు ఒకటి, రెండు సూచనలు చేసి చేతులు దులుపుకొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉంచాలని పశుపోషకులు కోరుతున్నారు.

ప్రైవేటుగా కొంటున్నాం

మండలంలో పశువైద్యశాల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ మందులు మాత్రం అందుబాటులో లేవు. ఉన్నాతాధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉంచాలి.

– స్వామి, పాగుంట, గొర్రెల యాజమాని

ఇండెంట్ పంపించాం

మండల కేంద్రంలో పశువుల ఆస్పత్రి లేకపోవడంతో ఉప కేంద్రాలకు మందులు తక్కువగా వస్తున్నాయి. ప్రస్తుతం వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన మందులకు ఇండెంట్ పంపిచాం.

– వినయ్‌కుమార్, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి

యూరియా కృత్రిమ కొరతను అరికట్టాలి



రైతువేదిక ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అయిజ: యూరియా కృత్రిమ కొరతను అరికట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనం వద్ద బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత ఏర్పడిందన్నారు. రెండు బస్తాల యూరియా కోసం రైతులు ప్రతిరోజు రైతువేదికల వద్ద క్యూలో నిలబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి సీజన్‌కు రాష్ట్రానికి 9.87 లక్షల టన్నుల యూరియా అవసరం ఉండగా కేంద్ర ప్రభుత్వం 12.47 టన్నుల యూరియా పంపిందన్నారు. కృత్రిమ కొరత సృష్టించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌కుమార్, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, లక్ష్మణాచారి, రాజశేఖర్, రఘు, ఖుషి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో కళా సిల్క్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళ ప్రదర్శన వినియోగదారుల నుంచి విశేషంగా ఆకట్టుకుంటోంది. చేనేత, హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వివిధ రాష్ట్రాల చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగ, ఎరిశిల్క్స్, బిహార్‌లోని బాగల్పుర శిల్క్స్, టస్సర్, చత్తీస్గఢ్‌లోని ట్రిబిల్ వర్క్స్, కోసా శిల్క్, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్మూ కాశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, పాస్మిక్ శాల్, కర్ణాటకలోని క్రేస్, ప్రింటెండ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్తాన్‌లోని కోటా, బందాని, బ్లాక్ ప్రింట్, సంగ్నారి ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దానీ, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్‌తోపాటు హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నోవి కుర్దీస్, డోర్ కర్టెన్స్ తదితర రాష్ట్రాల హ్యాండీ క్రాఫ్ట్స్, న్యూట్రిషన్ ఫుడ్ విక్రయిస్తున్నారు.

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం



ఎర్రవల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో జరిగే ఓ కార్యక్రమానికి మంత్రి వెళ్తుండగా అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప స్థానిక నాయకులతో కలిసి ఎర్రవల్లి కూడలిలో మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, రాముడు, తిమ్మారెడ్డి, బీసన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రజక సంఘ రాష్ట్ర కార్యదర్శి రాక

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట గ్రామంలో దాడికి గురైన రజకులను పరామర్శించేందుకు రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఆదివారం రానున్నట్లు జిల్లా రజక సంఘం నాయకులు మద్దిలేటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



కొండేరులో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ అమీర్‌పాషా

అలంపూర్/శాంతినగర్/మల్దకల్/మానవపాడు/ఎర్రవల్లి: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని బీఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను శనివారం సత్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నతంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ప్రతి ఏడాది సత్కరించడానికి వీలుగా దాతలు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దాతలు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ జయరాముడు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

■ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే వారే ఉపాధ్యాయులని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి ఎమ్మార్సీ భవన సముదాయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన కేజీబీవీ ఫిజిక్స్ టీచర్ సృజనతోపాటు మండలంలోని సీనియర్ ఉపాధ్యాయులు ఏడుగురిని శాలువా, మెమొంటోలు అందజేసి సన్మానించారు.

■ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైందని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ అన్నారు. మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులను ఎంఈఓ ఆధ్వర్యంలో సన్మానించారు. రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, రాజేశ్వర్‌రెడ్డి, జాకీర్ హుసేన్, భాస్కర్, జ్యోతి, మనెమ్మ, శుభ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో..

■ మానవపాడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

■ ఎర్రవల్లి మండలంలోని ఎంఈఓ కార్యాలయం కొండేరులో ఎంఈఓ అమీర్‌పాష సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరద సుందర్ రెడ్డి, హనుమంతు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.







మల్దకల్‌లో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, శాంతినగర్‌లో.., అలంపూర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

రక్తదానం చేస్తే పునర్జన్మనిచ్చినట్లే

గద్వాలటౌన్: రక్తదానం చేస్తే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మను ఇచ్చినట్లేనని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌సరిత అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తదానం అన్నింటికన్నా మిన్న అన్నారు. ఆపత్కాలంలో అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాన్ని రక్షించవచ్చని పేర్కొన్నారు. అవకాశం లభించినప్పుడల్లా ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు

గద్వాల పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణరావు, వాకిటి శ్రీహరిలు సరిత ఇంటికి వెళ్లి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో అన్నదానం నిర్వహించారు.



రక్తదానం చేస్తున్న కార్యకర్తలను అభినందిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సరిత

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న వైద్య అధికారులు

అలంపూర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు హేమ మానస అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని గురుకుల సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాలలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైద్య సిబ్బంది రాణి, కృష్ణవేణి, చంద్రన్న, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకువైద్య పరీక్షలు

అయిజ: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక వి ద్యాలయ విద్యార్థినులకు శనివారం ప్రాథమిక ఆరో గ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో హారిక, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మేళాతో బోధన సామర్థ్యాలు మెరుగు

ధరూరు: ప్రతి ఏటా నిర్వహించే ఎఫ్‌ఎల్‌ఎన్, టీఎల్‌ఎం మేళాలతో బోధన సామర్థ్యాలు మెరుగవుతాయని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్, టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఉపాధ్యాయులు విధుల్లో భాగంగా ప్రతి సంవత్సరం సబ్జెక్టులపై ఏర్పాటు చేసే మేళాలో వృత్తిలో నిబద్ధత పెరుగుతుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి చిత్రాలు ప్రదర్శించినట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, సాయన్న, విజయ్‌శివ, ఆంజనేయులు, మురళీధర్, సోమసుందర్‌గౌడ్, శ్రీధర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

రజక సంఘం మండల కమిటీ ఎన్నిక



రజక సంఘం సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో శనివారం మండల నూతన రజక సంఘం కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు వీరవనిత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడిగా రామ్మోహన్, గౌరవ అధ్యక్షుడిగా బీచుపల్లితో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మదు, ఈదన్న, నారాయణ, రాముడు, తిమ్మన్న, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



అలంపూర్‌లో జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ పద్మావతి



మానవపాడులో..

అలంపూర్: మండలంలోని ఎంపీటీసీ ఓటర్ల జాబితాను ఆవిష్కరించినట్లు ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. అలంపూర్ పట్టణంలోని కార్యాలయంలో ఎంపీడీఓ పద్మావతి ఎంపీటీసీల ఓటర్, పోలింగ్ స్టేషన్ల జాబితాను శనివారం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్‌ల వారిగా ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు ఉన్నవారు ఈ నెల 8న లిఖిత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 9న సమస్య పరిష్కరించి 10వ తేదీన తుది జాబితాను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

■ మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ ఓటర్ జాబితాను సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీకి సంబంధించి జాబితాను నోటీసు బోర్డుపై ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

■ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన ఓటర్ జాబితాను ఎంపీడీఓ రాఘవ ఆధ్వర్యంలో నోటీస్ బోర్డులపై ఏర్పాటు చేశారు.

‘అక్రమ కేసులతో కార్మిక ఉద్యమాన్ని అణచలేరు’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అక్రమ కేసులతో కార్మిక ఉద్యమాన్ని అణచలేరని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మెడికల్‌రంగ ముఖ్య కార్యకర్తల (సంఘం అనుబంధం) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక జీజీహెచ్‌లో కాంట్రాక్టు పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజింగ్ విభాగాల్లో పని చేసే కార్మికులను సీహెచ్‌ఓ రాంనాయక్, ఎస్‌హెచ్‌ఓ నరేందర్ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మిక సమస్యలపై అడిగిన సంఘం నాయకులను దూషిస్తూ, దాడులకు దిగుతున్నారన్నారు. వారిద్దరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని, జీఓ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. 650 పడకలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని జిల్లావ్యాప్తంగా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు చెన్నయ్య, మొగులయ్య, నరసింహ, రంగన్న, అంజి, శ్రీను, శంకర్, యాదయ్య, పద్మ, సత్యమ్మ, అలివేల, ఇందిర, సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి రూరల్: జిల్లాలోని పెద్దగూడెం శివారు ఎంజేపీ, టీబీసీ, డబ్ల్యూఆర్ బీఎస్సీ (హానర్స్) వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ ఇంజినీరింగ్, ప్లాంట్ పాథాలజీ బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, ఎంటెక్‌లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణులైన వారు అర్హులని.. పీహెచ్‌డీ, నెట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హతల నిజ ధ్రువపత్రాలు, ఒక సెట్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పూర్తి బయోడేటాతో ఈ నెల 10న పెద్దగూడెం శివారు వ్యవసాయ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.